హైదరాబాద్ వార్త



# విద్యుత్ డిమాండ్ పైపైకి..

- గ్రేటర్‌లో పెరుగుతున్న వినియోగం
- ఇంకా బంద్‌కాని ఏసీలు, కూలర్లు
- జూలైలోనూ గిర్రున తిరుగుతున్న మీటర్లు
- 85మిలియన్ యూనిట్లకు చేరిన డిమాండ్
- సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపైన పెరుగుతున్న లోడ్
- ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎండా కాలం పోయి..వర్షాకాలం ప్రారంభమైంది. అయినా కానీ గ్రేటర్ విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. ఎల్‌నినో ప్రభావం, తీవ్ర ఉక్కపోత, అధిక ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ శాతం పెరగడం, వర్షాలు ఆలస్యంగా కురవడం వంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా విద్యుత్ వినియోగం పెరుగుతుంది.' ఈ ఏడాది జూలైలోనూ తీవ్ర ఉక్కపోతతో వాణిజ్య, పారిశ్రామిక, ఐటీ, వ్యవసాయ, సేవారంగ సంస్థలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో ఎయిర్ కండీషనర్లు, కూలర్లు, ఫ్యాన్లు తదితర శీతలీకరణ పరికరాల వినియోగం ఇంకా కొనసాగుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగం గతేడాది 957.79 మిలియన్ యూనిట్ల నుంచి ఈఏడాది జూలైలో 1,071.94 మిలియన్ యూనిట్లకు చేరి (11.9 శాతం) వృద్ధి నమోదు చేసింది. రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగ వృద్ధి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో తగినంత విద్యుత్‌ను సమకూర్చడంతో పాటు విద్యుత్ కొనుగోలు, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, ఫీడర్ల పర్యవేక్షణ, లోడ్ మేనేజ్‌మెంట్, విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ విపాటిల్ తెలిపారు.

**వర్షాలకూ ఇబ్బంది లేకుండా..**

వర్షాకాల పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక నిర్వహణ చర్యలు చేపట్టామని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా లోపాలు తలెత్తిన వెంటనే సరిచేసి వినియోగదారులకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని పేర్కొన్నారు.

**గతేడాదితో పోలిస్తే..**

గ్రేటర్లో విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరుగుతోంది. గతేడాది జూలై 15న 63 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవ్వగా ఈ ఏడాది జూలై 13న రికార్డుస్థాయిలో 85 మిలియన్ యూనిట్లు నమోదయ్యింది. ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో కొనసాగితే వారం రోజుల్లో గ్రేటర్లో వినియోగం 90 మిలియన్ యూనిట్లకు చేరుకోవచ్చని డిస్కం అధికారులు అంచనా వేస్తున్నారు. పగలు గరిష్ట ఉష్ణోగ్రతలు, రాత్రి వేళల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 45 డిగ్రీలు అధికంగా నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాధారణంగా వర్షాకాలం 3200-3500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ గ్రేటర్ నమోదైతే ఈవారం 4052 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యిందని తెలుపుతున్నారు. భారీవర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలకు బయటకు వచ్చేందుకు ఆలోచిస్తున్నారని గత పదేళ్లలో జూలైలో ఇలాంటి వాతావరణం ఎప్పుడు నమోదుకాలేదని అధికారులు చెబుతున్నారు.

# ఓటు పట్ల నిర్లక్ష్యం వద్దు

- -లేకుంటే డ్రాఫ్ట్‌లో పేరు గల్లంతు
- -ఎస్ఐఆర్ ఫాం నింపితే ...బిఎల్‌వోలకు ఇవ్వాలి
- -ఆన్‌లైన్‌లో చేస్తే మాన్యువల్‌గా ఇవ్వాల్సి అవసరం లేదు
- -సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నెంబర్ 1950
- -జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్



కలెక్టర్ ప్రియాంక ఆలతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఓటు పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే డ్రాఫ్ట్ లో పేరు పోతుందని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిఆర్వీ.కర్ణన్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌లను తప్పనిసరిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తిరిగి అందించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్‌లను తిరిగి సమర్పించేందుకు ఆగస్టు 3 వరకు చివరి తేదీ ఉందన్నారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో మొత్తం 47,36,669 మంది ఓటర్లు ఉన్నారని, ఎన్యూమరేషన్ ఫామ్‌ల పంపిణీని వంద శాతం పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే 7.8 శాతం మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఫామ్‌లు సమర్పించగా, మొత్తం 25.5 శాతం ఫామ్‌ల వివరాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 24.33 శాతం మంది ఆబ్సెంట్, షిఫ్టెడ్, (డెడ్)మరణించినవారు (ఏఎస్‌డీ) ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫామ్ సమర్పించిన వారు మళ్లీ మాన్యువల్ ఫామ్ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్ అందుకున్న వెంటనే నింపి సమర్పించాలని, చివరి రోజు వరకు వేచి ఉండవద్దని ఆయన సూచించారు. వచ్చే మూడు రోజుల్లో వీలైనంత ఎక్కువ మంది తమ ఫామ్‌లను బీఎల్ఓలకు అందించాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, షిఫ్టెడ్ అయిన వారిలో ఇంకా ఎవరికైనా ఫామ్ అందని వారు ఉంటే తమ బీఎల్ఓ లేదా బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను సంప్రదించాలని సూచించారు. ఓటర్లకు సహాయం చేసేందుకు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసుతో పాటు ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు కూడా ఎన్యూమరేషన్ ఫామ్‌లను సేకరించి ప్రతిరోజూ 50 ఫామ్‌ల వరకు బీఎల్‌ఓలకు అందజేయవచ్చని వివరించారు. ఎస్ఐఆర్‌పై విస్తృత ప్రచారం చేపట్టామని, ఎన్యూమరేషన్ ఫామ్ ఎలా నింపాలనే అంశంపై దశలవారీ వీడియో రూపొందించి సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఫామ్‌లలో ఏవైనా పొరపాట్లు ఉంటే ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాత ఫామ్-8 ద్వారా సవరణలు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పుడు పేర్లు ఎలా ఉన్న కూడా ఫామ్స్ ఇస్తే ఓటు కోల్పోకుండా ఉంటుం దన్నారు.

**ఆగస్టు 3వరకు అవకాశం..**

ఆగస్టు 3 వరకు ఫామ్స్ ఇవ్వడానికి అవకాశముందని ఆగస్టు 10న ఓటరు ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ లిస్ట్) విడుదల చేస్తామని, ఫామ్స్ ఇచ్చినవారి పేర్లు అందులో ఉంటాయని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు సమర్పించాలన్నారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 లోపు ఎన్నికల నమోదు అధికారికి (ఈఆర్‌వో) సూచించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని తెలిపారు. ఫైనల్ డ్రాఫ్ట్ అక్టోబర్ 12న విడుదల చేయనున్నట్లు తెలిపారు. అలాగే బంజారాహిల్స్‌లో బీఎల్‌ఓలపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మూడు పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన 2002 ఓటరు జాబితా అందుబాటులో లేకపోవడంతో, ఆ ఓటర్లను ప్రత్యేకంగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎస్ఐఆర్‌కి సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే 1950కి కాల్ చేయవచ్చన్నారు.

# కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ వన్‌వే ఏర్పాటుకు కసరత్తు

- జీహెచ్ఎంసీ, పోలీసు ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- ఐదు కిలోమీటర్లు నడిచి పరిశీలించిన అధికారులు
- పాదాచారుల రక్షణకు పెలికాన్ సిగ్నల్స్, లేన్ మార్కింగ్‌లు



కేబీఆర్ ఉద్యానవనం వద్ద పర్యటిస్తున్న సజ్జనార్, కర్ణన్, జోయల్ డేవిస్, కాజల్ అగర్వాల్ తదితరులు.

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్త:** కేబీఆర్ జాతీయ ఉద్యానవనం చుట్టూ హెచ్ సిటీ నిర్మాణ పనుల నేపథ్యంలో పోలీసు, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు బుధవారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వన్‌వే ఏర్పాటు కోసం చేపట్టాల్సిన అంశాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన విధానాలపై దాదాపు అయిదు కిలోమీటర్లు నడుచుకుంటూ పరిశీలించారు. కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి వాహనాల సాఫీ రాకపోకల కోసం వన్‌వే పనులను నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్, ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్, మున్సిపల్ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌లతోపాటు ఇతర ఉన్నతాధికారులు బుధవారం ఉదయం పరిశీలించారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన పర్యటించి ప్రధాన జంక్షన్లను పరిశీలించారు. అగ్రసేన్ కూడలి, ఫిలింనగర్, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్45, చెక్‌పోస్ట్, కేబీఆర్ ప్రధాన ద్వారం ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను అధ్యయనం చేశారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు కింద ఇటీవల నిర్వహించిన వన్‌వే ట్రయల్ రన్ సందర్భంగా తలెత్తిన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించిన అధికారులు, ఆయా ప్రాంతాల్లో తక్షణ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. అలాగే పాదచారుల భద్రత కోసం లేన్ మార్కింగ్‌లు, పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ, వన్‌వే విధానాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన చిన్నపాటి సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖతో సమన్వయంగా చర్యలు తీసుకుంటామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్, డీసీపీ (ట్రాఫిక్) కాజల్, ఏసిపి కట్టా హరిప్రసాద్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ ఎస్ఈ విజయ్‌కుమార్‌తో పాటు జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# జగన్నాథ ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు : ఎసిపి కట్టా హరిప్రసాద్

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని జగన్నాథ ఆలయంలో ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు జూబ్లీహిల్స్ జోన్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

- బంజారాహిల్స్ రోడ్ నెం. 12 లోని జగన్నాథ ఆలయం నుండి 16న మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రథయాత్ర నిర్వహించబడుతుంది. మాసబ్ ట్యాంక్, లక్డీకాపూల్, ఖైరతాబాద్ వైపు నుండి రోడ్ నెం. 12, ఫిలింనగర్, షేక్‌పేట్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 వైపు వెళ్లే వాహనదారులు రోడ్ నెం. 1, రోడ్ నెం. 10 జహీర్ నగర్, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఏసీబీ ఆఫీస్ బైలేన్, ఎమ్మెల్యే కాలనీ, ఒమేగా హాస్పిటల్, అపోలో జంక్షన్ మీదుగా వెళ్లవచ్చన్నారు.
- షేక్‌పేట్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్, టోలిచౌకి వైపు నుండి రోడ్ నెం. 12 వైపు వచ్చే వాహనదారులు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ నెం. 10 జహీర్ నగర్, బంజారాహిల్స్ రోడ్ నెం. 1 మీదుగా ప్రయాణించాలన్నారు.
- మాదాపూర్, హైటెక్ సిటీ, రోడ్ నెం. 45, రోడ్ నెం. 36 వైపు నుండి రోడ్ నెం. 12 వైపు వచ్చే వాహనదారులు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎన్టీఆర్ భవన్, రోడ్ నెం. 10, జహీర్ నగర్, బంజారాహిల్స్ రోడ్ నెం. 1 మీదుగా ప్రయాణించాలన్నారు.

సాధారణ ప్రయాణికులు పైన పేర్కొన్న ఊరేగింపుల వల్ల కలిగే ట్రాఫిక్ ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# భవనం పైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

-రెండు నెలల క్రితమే బెంగళూరు నుంచి నగర కార్యాలయానికి మారిన మృతుడు

**గచ్చిబౌలి, జూలై 15 ప్రభాతవార్త**

గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎన్నో సంవత్సరాల పాటు బెంగళూరులో ఉద్యోగం చేసి రెండు నెలల క్రితమే నగరానికి వచ్చి నాలెడ్జ్ సిటీలోని ఐటీ కంపెనీలో ఉద్యోగంలో చేరిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తాను పనిచేస్తున్న ఐటి కంపెనీ భవనం మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం 6 గంటలకు కార్యాలయం నుంచి బయటకు వెళ్లిన ఉద్యోగి అదే భవనంలో గడిపి రాత్రి 8.30 ప్రాంతంలో భవనంపై నుంచి కిందకు దూకాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన తిరువీది వి.అవినాష్(40)కు జ్యోతితో 2018లో వివాహం జరిగింది. వివాహం అనంతరం అవినాష్ ఉద్యోగరిత్యా భార్య,భర్తలు బెంగళూరులో ఉండగా, ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అవినాష్ ఉద్యోగం నగరానికి మారడంతో రెండు నెలల క్రితమే వీరి కుటుంబం నగరానికి వచ్చి కూకట్‌పల్లిలో నివాసం ఉంటుంది. అవినాష్ నాలెడ్జ్ సిటీలోని క్వాల్‌కాం భవనంలో గల హెచ్‌సిఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తాను పనిచేస్తున్న కార్యాలయం నుంచి బయలుదేరి వస్తున్నట్లు భార్య జ్యోతికి మెసేజ్ చేసిన అవినాష్ అనంతరం అందుబాటులో లేకుండా పోయాడు. అవినాష్ వద్ద రెండు ఫోన్లు ఉండగా, ఓ ఫోన్ స్విచ్చాఫ్ అని రావడం, మరో ఫోన్ ఎంతకూ లిఫ్ట్ చేయలేదు. అవినాష్ పనిచేస్తున్న కార్యాలయం మేనేజర్‌కు ఫోన్ చేయగా 6 గంటలకే కంపెనీలో నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపాడు. దీంతో జ్యోతి అమీర్‌పేటలో ఉండే తన సోదరుడు అరుణ్‌కుమార్‌కు సమాచారం అందించింది. దీంతో అరుణ్‌కుమార్ రాత్రి 8.30 గంటల ప్రాంతంలో క్వాల్‌కాం భవనం వద్దకు వెళ్లాడు. అదే సమయంలో భవనంలో ఉన్న జనం గుమిగూడి ఉండడం, ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో సంఘటనా స్థలికి వెళ్లిన అరుణ్‌కుమార్‌కు అవినాష్ మృతదేహం కనిపించింది. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అవినాష్ భవనం 5వ అంతస్థు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు నిర్వాహకులు రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు అవినాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా అవినాష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

# హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌కు సరికొత్త రూపు..

- రూ.26 కోట్లతో ఆధునికీకరణ పూర్తి
- 17న ప్రధానమంత్రి చేతుల మీదుగా జాతికి అంకితం



వివకాలను వెల్లడిస్తున్న సిపీఆర్వో శ్రీధర్ తదితరులు

**తార్నాక, జులై 15 ప్రభాతవార్త :** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేసిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం మీడియాకు స్టేషన్‌లో చేపట్టిన ఆధునికీకరణ పనులను వివరించారు. హైటెక్ సిటీ స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, లిఫ్టులు, ఎస్కలేటర్లు, విశాలమైన నిరీక్షణ ప్రాంగణాలు, ఆధునిక సమాచార సూచికలు, ఆకర్షణీయమైన ప్రవేశద్వారం, కొత్త పోర్టికో వంటి సౌకర్యాలు కల్పించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దశలవారీగా పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 1,300కు పైగా స్టేషన్లు అభివృద్ధి చెందుతున్నాయని, తెలంగాణలో రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో 40 స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఐటీ కారిడార్‌కు ప్రధాన ద్వారంగా ఉన్న హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు విభాగ రైల్వే మేనేజర్ కె. ముత్యాల నాయుడు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలకు విద్యుత్‌శాఖ సిద్ధం

-ఆలయాల వద్ద నిరంతర విద్యుత్ -ప్రత్యేక టీంల ద్వారా రక్షణ చర్యలు

-టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ పాటిల్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు నేటి నుంచి నుండి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు అమ్మవారి ఆలయాలను దర్శించుకోనున్న నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) భక్తులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయ, నాణ్యమైన, సురక్షిత విద్యుత్ సరఫరా అందించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసిందని టీజీఎస్పీడీసీఎల్ సిఎండీ జితేష్ వి. పాటిల్ ఒక్రపటనలో తెలిపారు. మేరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు సంస్థ పరిధిలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నగరంలోని గోల్కొండ, బాల్కంపేట, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజ, హరిబౌలి తదితర ప్రధాన బోనాల ఉత్సవ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఆలయాల వద్ద ఊరేగింపు మార్గాల్లో పర్యవేక్షణ, 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు, సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు ముందస్తు తనిఖీలు పూర్తిచేసి మొబైల్ ట్రాన్స్ ఫార్మర్లు, బ్యాకప్ విద్యుత్ సదుపాయాలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో 1912 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# ఘన వ్యర్థాల నిర్వహణకు కేంద్రాలను సందర్శించిన ఎంఎంసీ కమిషనర్

- శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం



పర్యటనలో అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎంఎంసి కమిసనర్ వినయ్ కృష్ణారెడ్డ

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి,, అదనపు కమిషనర్ (శానిటేషన్), డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లతో కలిసి ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన కీలక కేంద్రాలను సందర్శించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మొదట కుత్బుల్లాపూర్‌లోని నిర్మల బయో ఇంజినీరింగ్ ప్లాంట్‌ను సందర్శించిన కమిషనర్ సరస్సులలో విస్తరిస్తున్న వాటర్ హయాసింథ్ (నీటి కలుపు మొక్కలు)ను సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను పరిశీలించారు. సరస్సుల నుంచి వాటర్ హయాసింథ్‌ను ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించేందుకు అయ్యే కార్టింగ్, టిప్పింగ్ ఛార్జీలపై సమగ్ర అధ్యయనం చేసి, వ్యర్థాన్ని వనరుగా మార్చే సుస్థిర విధానాలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఫతుల్లగూడలోని నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను పరిశీలించిన కమిషనర్, ప్లాంట్ ఇన్‌చార్జీలు, నిర్వహణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఉప్పల్ రోడ్, తార్నాకలోని సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఉన్న బయోగ్యాస్ ప్లాంట్‌ను సందర్శించి, తడి వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, బయోగ్యాస్ ఉత్పత్తి సాంకేతికతలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎస్ఐఆర్-ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డా. గంగాగ్ని రావు, శ్రీ కంచుబొట్ల రాజు, శానిటేషన్ అదనపు కమిషనర్ శ్రీ సి.ఎన్. రఘు ప్రసాద్‌తో కలిసి ప్లాంట్ పనితీరు, అనారోబిక్ గ్యాస్ లిఫ్ట్ రియాక్టర్ ఆధారిత బయోగ్యాస్ సాంకేతికత, తడి చెత్తను పునరుత్పాదక ఇంధనంగా, సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను సమీక్షించారు.




## ఆటో డ్రైవర్ భరత్‌కు భజరంగ్‌దళ్ అండ



ఆటోడ్రైవర్ భరత్‌ను శాలువ కప్పి సన్మానిస్తున్న విహెచ్‌పి జాతీయ ప్రముఖ్ డాక్టర్ రవినూతల శశిధర్, కె.శ్రీకాంత్ తదితరులు

**గోషామహల్, జూలై 15ప్రభాతవార్త:**
భారతీయుడిగా తన ఆటోరిక్షాపై ఇక్కడ పుట్టిన వాళ్లంతా హిందువులే.. అనే స్టిక్కర్ పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేని ఓ వర్గం ఆటో డ్రైవర్ భరత్‌పై దాడి చేయడం పట్ల భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ విభాగాల ప్రతినిధులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోఠిలోని విశ్వహిందు పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ కొండా శ్రీకాంత్, విశ్వహిందు పరిషత్ భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి కళ్లెం రాజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈనెల 13వ తేదిన అత్తాపూర్‌లో జరిగిన ఘటనలో హిందు డ్రైవర్ బాధితుడిగా మారాడని పేర్కొన్నారు. తన ఆటోరిక్షాపై ఇక్కడ పుట్టిన వాళ్లంతా హిందువులే, అనే స్టిక్కర్ పెట్టుకొవడం రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమని అన్నారు. ఇతర మతాలకు చెందిన వ్యక్తులు తమ మతపరమైన సందేశాలు ప్రదర్శిస్తున్నప్పటికి వాటిపై చర్యలు తీసుకోవడంలేదని అగ్రహం వ్యక్తం చేశారు. అత్తాపూర్ ఎస్ఐ శ్రీనివాస్ వ్యవహారశైలిలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధితుడిపైబెదిరించడం, కేసులు, పెడతామని హెచ్చరించడం సరికాదని విమర్శించారు. రాపిడో, జెప్టో వంటి సేవల్లో జరిగిన ఘటనలపై కూడాచర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమీషనర్ వి.సి.సజ్జన్నార్‌ను కోరారు. ప్రస్తుతం అతనికి ధైర్యం చెప్పితమ ఆద్వర్యంలో తీసుకువచ్చినట్లు తెలిపారు. భజరంగ్, విహెచ్‌పి తరపున భాదితుడి కుటుంబానికిఅన్ని విధాలుగా ఉంటామని హామి ఇచ్చారు. చట్టపరమైన చర్యలు పూర్తయ్యే వరకు భాదితుడు భరత్‌కుపూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రచార ప్రముఖ డాక్టర్ రవినూతల శశిధర్, తెలంగాణ రాష్ట్ర సహ కన్వీనర్ ముఖేష్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, భరత్ వంశీదీపక్ తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్ జలమండలిలో గండిమైసమ్మకు బోనాలు



గండి మైసమ్మకు బోనం సమర్పించి పూజలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

**చాంద్రాయణగుట్ట, జులై 15, ప్రభాతవార్త :** జలమండలి అలియాబాద్ రిజర్వాయర్ ఆవరణలోని శ్రీ గండి మైసమ్మ దేవాలయంలో బుధవారం అమ్మవారి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ డివిజన్-10 ఉద్యోగులు ఆషాఢ మాసం తొలి రోజున గండి మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు కలిసి ప్రతియేడు ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఉద్యోగులు గ్యాదరి బాలసర్వేశ్వరరావు, పి.బాలమణి, గణేష్, పర్వతాలు, మహ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ మాసంలో ఉద్యోగ విరమణ చేయబోతున్న ఎస్‌పి పి.బాలమణిని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను ప్రశంసించారు. శేష జీవితం సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

## అన్నదాన సత్రం ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ



ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

**చాంద్రాయణగుట్ట, జులై 15, ప్రభాతవార్త :** శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున హిందూ మాల అన్నదాన సత్రం ఉపాధ్యక్షులుగా హైదరాబాద్ పాతబస్తీ సుల్తాన్‌షాహి నివాసి గడ్డం సత్యనారాయణ నియమితులైయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు కమిటి అధ్యక్షులు బత్తుల కోటేశ్వరమ్మ, గౌరవాధ్యక్షులు పి.చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి వేల్పుల లక్ష్మీనారాయణల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న శ్రీశైల మల్లన్న భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. 2016లో జరిగిన సత్ర నిర్మాణంలో తన కృషిని గుర్తించి ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించటం సంతోషంగా ఉందన్నారు. మల్లికార్జున స్వామి అనుగ్రహంతో పెద్దల విశ్వాసాన్ని నిలబెడతానని వెల్లడించారు. తనకు సహకరించిన ప్రేమ్‌కుమార్, నాగయ్య, ఆనంద్ కుమార్, శేఖర్, వెంకటయ్య, శివకుమార్, వంశీ, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోండి



సర్ ధరఖాస్తు ఫారాన్ని అందిస్తున్న శాంతిదేవి

**బేగంబజార్, జూలై 15ప్రభాతవార్త:**
గడువులోగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా నాయకురాలు శాంతి దేవి అన్నారు. దాల్‌మండి కాలనీలోప్రత్యేక సర్ టేబుళ్లను ఏర్పాటు చేసి, ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బిఎల్‌వోలకు తమ వంతు సహాయ సహాకారాలను అందిస్తున్నారు. సర్ డేటా ద్వారా ఓటర్ నమోదు సర్ ధరఖాస్తులను తప్పులు పోకుండానింపుతున్నట్లు బిఆర్ఎస్ నాయకురాలు శాంతి దేవి తెలిపారు. ఓటర్లకు ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగాసర్ ప్రక్రియను పూర్తి చేసేందుకుగాను అధికారులకు సహకరిస్తామన్నారు.




ఆగస్టు 29,30న జరిగే ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్ లోగో ఆవిష్కరిస్తున్న ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్, శ్రీకృష్ణ కుమార్, ఠాకూర్, శ్రీప్రసాద్ షిండే

## ఎస్ఐఆర్‌లో 2002 సమాచారం ఎందుకు?.. ఎమ్మెల్యే తలసాని ప్రశ్న

**సంజీవరెడ్డి నగర్, జూలై 15, ప్రభాతవార్త:**
ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో 2002 సంవత్సరం సమాచారాన్ని ఎందుకు అడుగుతున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. బుధవారం సనత్‌నగర్‌లోని సుభాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను ఆయన సందర్శించి కార్యక్రమం అమలు తీరును, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఎస్ఐఆర్‌లో కోరుతున్న వివరాలు గందరగోళంగా ఉన్నాయని, సరైన శిక్షణ లేని ఎన్యుమరేటర్లను నియమించడంతో ఫారాలు నింపడంలో సమస్యలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన తలసాని, ఫారాలు నింపే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొరపాట్లు జరిగితే ఓటు జాబితా నుంచి పేరు తొలగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వానికి ఎస్ఐఆర్ కార్యక్రమంపై సరైన పట్టింపు లేదని విమర్శించారు. అవగాహన లేని సిబ్బందితో కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. తప్పిదాల వల్ల ఓట్లు తొలగిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం ద్వారానే ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, పార్టీ నాయకులు సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రమేష్ గౌడ్, ఖలీల్, శేఖర్, జమీర్, పురుషోత్తం, సమీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

# పేదల దేవుడు పిజెఆర్ : విజయారెడ్డి

**శేరిలింగంపల్లి, జూన్ 15 ప్రభాతవార్త**
పేద ప్రజలకు చిన్న కష్టం వస్తే చలించే పీజేఆర్ పేదల దేవుడుగా తన స్థానాన్ని ప్రజల గుండెల్లో సుస్థిరం చేసుకున్నారని పీజేఆర్ కుమార్తె, ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. చందానగర్ డివిజన్‌లోని పీజేఆర్ స్టేడియం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన మాజీ మంత్రి, సీఎల్‌పి లీడర్, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ పి.జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని స్థానిక శాసన సభ్యులు అరికెపూడి గాంధీ, యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్, తాజా మాజీ కార్పొరేటర్లతో కలిసి పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి లాంచనంగా అవిష్కరించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ.. పేదలకోసం నిరంతరం తపిస్తూ, వారి సేవలోనే తరించిన పీజేఆర్ చిరస్మరణయులన్నారు. అతి పెద్ద నియోజకవర్గమైన ఖైరతాబాద్‌లో ఎమ్మెల్యే పనిచేసి ప్రజలసేవకై పరితపించిన మహోన్నతుడు పీజేఆర్‌యని ఆమె కొనియాడారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ..పీజేఆర్ తన చివరి శ్వాస వరకు పేదల కోసమే పాటుపడ్డారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి ఆసుపత్రిలో చేరటం, మృతిచెందటం రాష్ట్రంలోని నిరుపేదలను కలచివేసిందన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో పీజేఆర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం, ఒక ప్లైఓవరుకు పీజేఆర్ పేరు పెట్టడం పీజేఆర్‌కు నిజమైన నివాళిగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, దొడ్ల వెంకటేశ్ గౌడ్, శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, రఘునాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్, మోహన్‌గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ఆశోక్ గౌడ్, వీరేశం గౌడ్, రఘునందన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మిర్యాల రాఘవరావు, ప్రీతం, కే. చంద్రశేఖర్‌రెడ్డి, ప్రీతం, బాలింగ్ గౌతంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్‌లో పీజేఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, తదితరులు

## వ్యాపారవేత్త కిడ్నాప్, దోపిడీ, బెదిరింపులు కేసులో ఐదుగురు ఆరెస్టు

**అల్వాల్, జూలై 15 ప్రభాతవార్త:** వ్యాపార వేత్తను హనీ ట్రాప్‌లోకి లాగి నకిలీ పోలీసులు అవతారంలో కిడ్నాప్, దోపిడీ, బెదిరింపులకు పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను మీడియా సమావేశంలో మల్కాజిగిరి జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ బుధవారం తెలిపారు. గత సంవత్సరం 14 నవంబరు 2025 రోజున మచ్చ బొల్లారం ఐస్ ఫ్యాక్టరీ రోడ్డు వద్ద వ్యాపార వేత్త అయిన గర్లపాటి వెంకట దుర్గ నాగేశ్వర సిద్ధార్థ(40)ను పోలీసులుగా పేర్కొంటూ ఐదుగురు వ్యక్తులు అడ్డగించారు. విచారణ పేరుతో బాధితుడిని భయభ్రాంతులకు గురి చేశారు. నకిలీ పోలీసులుగా నటించిన వారిలో నాగరాజు రఘు వర్మ, సునీల అలియాస్ ఫౌజీ, రింకు అలియాస్ రిక్కి సందు, మోహిత్ అలియాస్ క్రిషాద్ రాజేష్ అలియాస్ సర్పంచ్ అలియాస్ జయ్‌వీర్ సింగ్‌లు ఉన్నట్లు పోలీసు విచారణలో తేలింది. ఐస్ ఫ్యాక్టరీ వద్ద నిందితులు బాధితుడిని స్కార్పియో వాహనంలో విచారణ పేరుతో తీసుకుని వెళ్ళడం జరిగింది. వాహనంలోకి ఎక్కించుకున్న నిందితులు అతడి ఒంటిపై ఉన్న 10 తులాలు బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, ఒన్ ప్లస్ మొబైల్ ఫోన్‌ను గుంజుకున్నారు. కుటుంబ సభ్యులను బెదిరించి 8లక్షలు రూపాయలు వసూలు చేశారు. అనంతరం సిద్ధార్థను ఒరిస్సా ఆంధ్రా సరిహద్దు అయిన బర్హంపూర్ అటవీ ప్రాంతంలో వదిలేశారు. కిడ్నాప్ డబ్బు విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు బాధితుడి హెచ్చరించారు. అంతకు ముందు సిద్ధార్థ వీసాకు సంబంధించిన పనులను తోటకూరి గోపి క్రిష్ణ అలియాస్ గోపి, చటారి మాధవి అలియాస్ మధు ద్వారా చేయించుకున్నట్లు పోలీసు విచారణలో తేలింది. ఇరువురు ప్రధాన నిందితుడైన నాగరాజు రఘ వర్మకు సిద్ధార్థ కదలికలను ఎప్పటికప్పుడు చేరవేసే వారు. ఇద్దరితో పాటుగా నాగరాజు రఘ వర్మను 23 జూన్ 2026 జగద్గిరి పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. విచారణ కొనసాగింపులో బాగంగా మిగిలిన నిందితుల వేటను అల్వాల్ డిఐ వీరబాబు, ఎస్ఐ చంద్రశేఖర్ టీములు కొనసాగించారు. ఎ2గా ఉన్న సునీల్ అలియాస్ ఫౌజీ అలియాస్ సునీల్ కుమార్(38)ను చండీఘర్ కురుక్షేత్ర వద్ద, ఎ3 రింకు అలియాస్ రింకూ సందు(40) హెడ్ కానిస్టేబుల్ కురుక్షేత్ర హర్యాన, ఎ5 రాజేష్ అలియాస్ సర్పంచ్ అలియాస్ జయ్‌వీర్ సింగ్(40) హర్యాన జింద్ జిల్లా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు వద్ద నుంచి 3.5 తులాలు బంగారు ఆభరణాలు, 3.30 లక్షలు నగదు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అంతరాష్ట్ర పోలీసులుతో కలిసి నిందితులను పట్టుకోవడంలో విశేషమైన కృషి చేసిన డిఐ వీర బాబు, ఎస్ చంద్రశేఖర్ బృందాన్ని డిసిపి శ్రీధర్ అభినందించారు.




మీడియా సమావేశంలో డిప్యూటీ కమీషనర్ శ్రీధర్

## బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి : చాతిరి పార్థసారథి



శ్రీరాం నగర్ కమాన్ బస్తీకమిటీ అవసరాలకు కుర్చీలను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నేత చాతిరి పార్థసారథి

**చిక్కడపల్లి జులై 15 ( ప్రభాతవార్త ) :** శ్రీరాం నగర్ డివిజన్ పరిధిలోని కమాన్ బస్తీ సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం నూతనంగా ఏర్పడిన శ్రీరాం నగర్ కమాన్ బస్తీ కమిటీ సవ్యంగా నిర్వహించుకోవడానికి, బస్తీ అవసరాల నిమిత్తం మౌలిక వసతుల కల్పన కింద బుధవారం 20 ప్లాస్టిక్ కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ ఎల్లవేళలా ముందుంటుందని హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులంతా సమిష్టిగా పనిచేస్తూ బస్తీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ అధ్యక్షుడు జి.సురేష్, సి .నరేష్, బి.రమేష్, ఎం.నాగార్జున తో పాటు సభ్యులు, పాల్గొన్నారు.

## క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న సురేందర్ రెడ్డి

**అల్వాల్, జూలై 15 ప్రభాతవార్త:** ఓల్డ్ అల్వాల్ ప్రభుత్వ బాలుర బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా స్థలాన్ని కేటాయించాలని తెలంగాణా ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి వినతి పత్రం అందించారు. బుధవారం పఠశాలలో సైన్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రికి క్రీడా స్థలం లేక విద్యార్థులు పడుతున్న సమస్యను వివరించారు. పాఠశాలకు దగ్గరలోనే దాతలు గతంలో దానం చేసిన భూమి ఖాళీగా ఉందన్నారు. సదరు భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటుగా క్రీడాస్థలంగా అభివృద్ధిపరచాలని ఆయన కోరారు.

## న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న లాయర్లు

**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:**
న్యాయవాదుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్ కోర్టు బార్ సోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి పలువురు ప్రముఖ వైద్యులు హాజరై సుమారు రెండు వందల మంది న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలోసాధారణ వైద్య పరీక్షలు, బి పి, షుగర్, బరువు తనిఖీ, కంటి, దంత పరీక్షలు, గుండె, ఆర్థో, న్యూరో సంబంధిత పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఒకటవ అదనపు చీఫ్ జడ్జి సిహెచ్ చంద్రకిషోర్ హాజరై మాట్లాడుతూ వృత్తిపరమైన ఒత్తిడి ఎక్కువసేపు కూర్చోవ దం వల్ల న్యాయవాదులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందుకే ఇలాంటి వైద్య శిబిరాలు చాలా అవసరం అని అన్నారు. సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ సుధాకర్ మాట్లాడుతూ న్యాయవాదుల ఆరోగ్యం సమాజానికి ఎంతో ముఖ్యం. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాబురావు, సంయుక్త కార్యదర్శి విక్రమ్ కుమార్, లైబ్రరీ సెక్రెటరీ పుష్పలత, కోశాధికారి డి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళలంటే ఎంతో ఇష్టం : రష్మీ ఠాకూర్

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్తః** చేనేత కళలంటే తనకు ఎంతో ఇష్టమని అంటున్నారు మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మీ ఠాకూర్. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మన కళలకు, ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందన్నారు. చేనేత కళలను ప్రపంచానికి మరింత చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బోనాలు, ఆషాఢమాసంతోపాటు పలు పండుగలు, శుభకార్యాల కోసం వన్‌స్టాప్‌గా ఈ ప్రదర్శన ఆకట్టుకుంటుందన్నారు. దాదాపు 80కిపైగా ప్రదర్శన కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ నెల 22 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్ తెలిపారు.

## కళకు కులమత ,ప్రాంతీయ భాషా బేధాలు లేవు : జస్టిస్ భాషా నవాజ్ ఖాన్

**చిక్కడపల్లి జులై 15 ( ప్రభాతవార్త ) :** కళకు కుల మత ప్రాంత భాషా బేధాలు లేవు కేవలం మానవీయ సంబంధాలు మాత్రమే ఉంటాయి అని మల్కాజిగిరి కోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాషా నవాజ్ ఖాన్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆరాధన అధినేత లోకం కృష్ణయ్య నిర్వహణలో తెలుగు లో వివిధటి వి ఛానెల్స్ న్యూస్ ప్రెజెంటర్స్ కి పురస్కార ప్రదానం సభ కన్నుల పండుగగా జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నవాజ్ ఖాన్ పురస్కార ప్రదానం తో పాటు దూరదర్శన్ (సప్త గిరి) సరిత సాక్షి చానెల్ రాజేష్ కు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ స్వాతి సి వి ఆర్ న్యూస్ చానెల్ భవాని కి జీవిత సాఫల్య పురస్కారం బహుకరించి మాట్లాడారు సమాజంలో కళలు తో పాటు మనుష్యుల మధ్య పరస్పర సహకారంతో పరులకు సహాయం చేయడం కూడా కళ అని చెప్పారు అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ ముప్పై రెండు సంవత్సరాలు గా ఆరాధన సంస్థను నిర్వహించటం సులువు కాదనీ లోకం కృష్ణయ్య నిబద్ధత తో నిర్వాహిస్తూ ప్రాయోజిత కార్యక్రమాలు చేస్తున్నారు అని అభినందించారు వేదిక పై యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ పారిశ్రామిక వేత్త చిల్ల రాజశేఖర్ రెడ్డి ప్రముఖ వ్యాఖ్యాత ఆషా లత నటులు జి సి రెడ్డి ఉమర్ ఖాన్ వెంకట రావు తదితరులు పాల్గొనగా సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు మోహన కృష్ణ వ్యాఖ్యానం లోతోలుత నాట్య గురువు ఆష్నా షిఫాలీ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ఆకర్షనీయంగా ప్రదర్శించారూ నాలుగు ఏళ్ల చిన్నారి మహా శ్రీ కృష్ణ వేషధారణలో ముద్దు ముద్దు గా నర్తించి ప్రేక్షకుల్ని ముగ్ధులను చేశారు.



పురస్కారాలను ప్రధానం చేస్తున్న జస్టిస్ భాషా నవాజ్ ఖాన్

## ఇంకుడు గుంత...ఇక లేదు చింత 'వార్త' ఎఫెక్ట్



శివగంగానగర్‌లోని డ్రైబోరింగ్ చుట్టూ ఇంకుడు గుంత కోసం తవ్వి మూసేసిన గోయ్యి

**చాంద్రాయణగుట్ట, జులై 15, ప్రభాతవార్త :** జలమండలి జంగమ్మెట్ సర్కిల్ జంగమ్మెట్ వార్డు పరిధిలో గల డ్రైబోరింగ్‌ల చుట్టూ గత కొన్ని రోజులుగా ఇంకుడు గుంతల (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్) నిర్మాణం జరుగుతోంది. సంబంధిత కాంట్రాక్టర్ మొరంబావి శివగంగానగర్ బస్తీలో వట్టిపోయిన (డ్రైబోరింగ్) బోరింగ్ చుట్టూ ఇంకుడు గుంత కోసం పెద్ద గోయిని తీశారు. ఆ తరువాత కొన్ని కారణాలతో దానిని పట్టించుకోవటం మానేశాడు. కూడలిలో ఉన్న ఇంకుడు గుంతను ఆనుకొని వెళుతున్న డ్రైనేజీ పైపులైన్ నుండి లీకేజీ ఏర్పడి మురుగు నీరు అందులోకి చేరుతుంది. స్థానికులు చెత్తాచెదారం, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లను వేస్తున్నారు. దీంతో ఇంకుడు గుంత మురికి గుంతగా మారింది. దోమలు, ఈగలతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి లోనైతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 13న 'డ్రైబోరింగ్‌ల చుట్టూ ఇంకుడు గుంతలు' అన్న శీర్షికన ప్రచురితమైన 'వార్త' కథనంతో ఉన్నతాధికారులు స్పందించి డ్రైబోరింగ్ చుట్టూ ఇంకుడు గుంత కోసం తీసిన గోయిని పూడ్చేశారు. అసలు విషయం తెలుసుకున్న బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## అర్హులంతా సర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి : అలీ మస్కతి



నింపిన గణన ఫారంను బిఎల్ఓకు అందజేస్తున్న చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి అలీ మస్కతి

**చార్మినార్, జులై 15 ప్రభాతవార్త :**
అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ సర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ సభ్యత్వం ఇంఛార్జి అలీ మస్కతి అన్నారు. నింపిన ఎన్యూమరేషన్ గణన ఫారంను ఆయన బుధవారం బిఎల్ఓలు రుక్మిణి, భాగ్యలక్ష్మీలకు అందజేశారు. ఈ సందర్బంగా అలీ మస్కతి మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమైందని, అర్హులంతా సర్‌లో తప్పకుండ తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. అర్హులైన ఓటర్లు బిఎల్ఓలు ఇచ్చిన ఎన్యూమరేషన్ గణన ఫారంలో వివరాలు నింపి సకాలంలో అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అలీ మస్కతి సోదరులు, కుటుంబ సభ్యులు, బిఎల్ఓలు రుక్మిణి, భాగ్యలక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న జంపన ప్రతాప్

**సికింద్రాబాద్, జులై 15 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ వార్డుల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం కొనసాగుతోంది. వివిధ బస్తిల్లో నాయకులు బీ. ఎల్వో లు ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. న్యూ బోయినపల్లి చిన్న తోకట్ట, నక్కల బస్తీలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ బుధవారం ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ ఐఆర్ ప్రక్రియ గడువు వచ్చేనెల 3వరకు ప్రభుత్వం పెంచడం శుభ పరిణామమని అన్నారు. శర వేగంగా పూర్తి స్థాయిలో ఎస్ఐఆర్ పూర్తి చేయాలనీ అధికారులను కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గందర గోళంగా ఉందని ఓటర్లకు అర్థం కావడం లేదని బీఎల్వో లు ఓటర్లకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ముఖేష్, లక్ష్మణ్, కొండల్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలి : శ్రీహరి



తాతాచారి కాలనీలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీహరి.

**బేగంపేట జులై 15, ప్రభాతవార్త**
ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని, ఒక్క ఓటు కూడా పోకుండా చూడాల్సిన బాధ్యత అధికార్లపై ఉందని బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి అన్నారు. బుధవారం ప్రకాశం నగర్ డివిజన్ పరిధిలోని తాతాచారి కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని శ్రీహరి స్థానిక నాయకులు సురేష్ యాదవ్‌తో కల్సి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇ బ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటు నమోదు పై అవగాహన కల్పించాలన్నారు.

## ప్రేమ పేరుతో వేధింపులు, బెదిరింపులు

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్తః**
ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాలంటూ బెదిరించి, వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే ఒక యువతిని బోరబండకు చెందిన ఫిరోజ్ ఖాన్ ప్రేమించాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. యువతికి సంబంధించిన విద్యా ధ్రువపత్రాలను తీసుకొని ఆమెపై ఒత్తిడి తీసుకొస్తున్నాడు. వివిధ ఫోన్ నంబర్ల నుంచి ఫోన్ చేస్తూ చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడటంతో యువతి ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో..**
పెళ్లి చేస్తానని మోసం చేసి రెండు సార్లు గర్భస్రావాలకు పాల్పడిన యువకుడిపై ఒక వివాహిత ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివసించే ఒక వివాహిత(28)కు ఇద్దరు పిల్లలున్నారు. ఫిల్మ్‌నగర్‌లో నివసించే రంజన్ కుమార్ ఆమెకు పిల్లలున్నారని తెలిసినా పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. ఆమెతో శారీరక సంబంధం కొనసాగించాడు. బాధితురాలు రెండు సార్లు గర్భం దాల్చగా, నిందితుడు గర్భస్రావ మాత్రలు ఇచ్చి గర్భాన్ని తొలగించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో పాటు ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. దీనికితోడు మరో యువతితో అతని వివాహం నిశ్చయమైన విషయం బాధిత మహిళకు తెలియడంతో ఆమె ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 69, 89 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సెలక్ట్ స్కిన్ క్లినిక్‌పై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్తః**
ఫిల్మ్‌నగర్‌లోని సెలెక్ట్ స్కిన్ క్లినిక్‌పై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎం. సాత్విక మానస ఫిల్మ్‌నగర్‌లోని సెలెక్ట్ స్కిన్ క్లినిక్‌కు చికిత్స కోసం వెళ్లారు. కాగా అక్కడ పనిచేస్తున్న దినేష్ నిర్లక్ష్యంగా చికిత్స చేయడంతో గాయాలై రక్తస్రావమైంది. దీంతో ఆమె మానసిక వేదనకు గురయ్యారు. దీనికితోడు క్లినిక్ సిబ్బంది ఆమెను బయటకు వెళ్లనీయకుండా నిర్బంధించారు. జరిగిన సంఘటనపై బాధితురాలు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ.. తలకు నాలుగు కుట్లు

**అత్తాపూర్ జూలై15, ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్‌డిజి పాఠశాలలో ఇద్దరు 8వ తరగతి విద్యార్థుల మధ్య జరిగిన గొడవ తీవ్ర పరిణామాలకు దారితీసింది. స్టూడెంట్ సుభాష్, వెంకటరమణపై వాటర్ బాటిల్‌తో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలు కాగా, 4 కుట్లు వేసినట్లు బాధితుడి తల్లిదండ్రులు తెలిపారు.

## చాక్లెట్ల ఆశ చూపి బాలికపై అత్యాచారం...

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 15, ప్రభాతవార్త :**
తన ఇంట్లో చాక్లెట్లు బిస్కెట్లు ఉన్నాయని ఆశ చూపి బాలికపై పండ్ల వ్యాపారి అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్‌కి చెందిన బాలిక స్థానికంగా ఏడవ తరగతి చదువుతోంది. అయితే స్థానికంగా ఉండే రెహాన్ (28) బాలిక ఇంటి ముందు పండ్ల వ్యాపారం చేసేవాడు. ఎప్పటినుండో బాలికపై కన్నేసిన నిందితుడు మే నెలలో తన ఇంట్లో చాక్లెట్లు బిస్కెట్లు చాలా ఉన్నాయని నీకు ఇస్తానని నమ్మించి ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఎవరికీ చెప్పొద్దని చెప్తే చంపేస్తానని బాలికను బెదిరించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులకు చెప్పకపోవడంతో మరోసారి బాలికను వేధింపులకు గురి చేయడంతో జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు కెపిహెచ్‌బి కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడైన రెహాన్‌పై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఇద్దరికి జైలు శిక్ష, ముగ్గురికి సామాజిక సేవ

**చిక్కడపల్లి, జులై 15 ( ప్రభాతవార్త ) :** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ఉక్కు పాదం మోపారు. బుధవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లి పరిధిలో ఇటీవల జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 13 మంది వాహనదారులను బుధవారం నాంపల్లి ఎం.ఆర్. కాంప్లెక్స్‌లోని 10వ జేఎంఎఫ్‌సీ కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘించిన ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. మరో ముగ్గురు నిందితులకు జరిమానాతో పాటు 2 రోజుల పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. మిగిలిన ఎనిమిది మందికి భారీ జరిమానాలు విధించారు. న్యాయస్థానం ఈ కేసుల్లో నిందితుల నుంచి మొత్తంగా రూ. 76,700 జరిమానా వసూలు చేసింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తారని, ఇలాంటి వారిపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## బైకుపై డ్రంక్ డ్రైవ్.. పట్టుకున్న పోలీసులు

**జూబ్లీహిల్స్, జూలై 15, ప్రభాతవార్తః**
బైకుపై మద్యం సీసా ఒక చేతిలో పట్టుకొని మరో చేతితో వాహనం నడుపుతూ సోషల్ మీడియాకు చిక్కిన నిందితుడిని ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. లక్డీకపూల్‌లోని ద్వారకా ప్యాలెస్ హోటల్ సమీపంలో ఒక వ్యక్తి బైకుపై డ్రంక్ డ్రైవ్ చేస్తుండగా కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో ఖైరతాబాద్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసుకున్నారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసుల సహాయంతో ఖైరతాబాద్ పోలీసులు కలిసి బైకు నడిపిన వ్యక్తిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన లోంక లక్ష్మణ్(32)గా గుర్తించారు. అతని వద్ద నుంచి బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి స్టంట్‌లో ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతాయని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటరెడ్డి తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం విద్యావస్థను నాశనం చేస్తుంది : మహేష్ కుమార్ గౌడ్



బోయిన్‌పల్లిలో ఛాత్రోంకిగూంజ్‌లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్,ఎమ్మెల్యే శ్రీగణేష్,జిల్లా అధ్యక్షులు దీపక్ జాన్ తదితరులు

**కంటోన్మెంట్,జులై 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం విద్యావస్థను నాశనం చేస్తుందని, నీట్ ప్రశ్నా పత్రం లీక్ ద్వారా ఎంతో మంది విద్యార్థుల చావుకు కారణమైన కేంద్ర విద్యామంత్రి, ప్రధాన మంత్రి తన పదవులకు రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్,ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్‌లు డిమాండ్ చేశారు. ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు బుధవారం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన ఛాత్రోంకిగూంజ్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం విద్యావస్థపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. దేశంలో విద్యావస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ జాన్,బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ కార్పోరేషన్ల చైర్మన్లు,కాంగ్రెస్ నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్‌లో మార్పులు తేవాలి : బాలక్రిష్ణారెడ్డి



కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ వేడుకల్లో ప్రసంగిస్తున్న విద్యా శాఖ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి

**కంటోన్మెంట్,జులై 15 ప్రభాతవార్త:** కోవిడ్,కరోనా మహమ్మారితో ప్రపంచ వ్యాప్తిగా విద్యా,పరిశోధన ఉపాధి రంగాలపై తీవ్ర ప్రభావం చూపిందని, మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను నడిపించాలని తెలంగాణ ఉన్నత విద్యా శాఖ మండలి చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి తెలిపారు. మ్యాజిక్ బస్ పౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లి కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో నిర్వహించిన వరల్డ్ యూత్ స్కిల్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచీరణ,సరళీకరణ, ప్రైవేటీకరణ, డిజిటలైజేషన్ వంటి మార్పులు ప్రపంచ దేశాలను పరస్పర అధారితంగా అంశాలపై స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా దేశం ప్రయాణిస్తుందన్నారు. యువత జాతీయ దృక్పదంతో పోటీపడి తమ విద్యాప్రమాణా లు,నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఢాక్టర్ ఓ.భవానీ, బీసీ వెల్ఫేర్ స్టడీ సర్కిల్ విభాగం డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ, కస్తూర్బాగాంధీ మహిళా కళాశాల ఎంబిఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ నీలా కమేశ్వరీ గొల్లపూడీతదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు రోజు వచ్చేలా చూడాలంటూ వేడుకలు



గోవర్ధన్‌రెడ్డికి తమ సమస్యలు వివరిస్తున్న దూద్‌ఖానా బస్తీ వాసులు

**జూబ్లీహిల్స్, జులై 15, ప్రభాతవార్తః**
ఖైరతాబాద్ నియోజకవర్గం దూద్‌ఖానా బస్తీలో బుధవారం సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. రెండు, మూడు రోజులకు ఒకసారి తాగునీరు విడుదల చేస్తున్నారని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నీరు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఒకవేళ నీరు వచ్చినా సన్నని ధారలా వస్తుందన్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వెంటనే ఆయన జలమండలి అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. రోజువారి నీటి సరఫరా చేసేలా ప్రయత్నించాలని కోరారు. మరోవైపు కాలనీలో వీధిదీపాల సమస్య ఉందని, పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉటుందని ఆయనకు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామినిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు యాదిలక్ష్మి, విజయ్‌చందర్, మొయినుద్దీన్, అబ్బాస్, బలరాం, కృష్ణవేణి, మంజుల, శ్రీనివాసనాయుడు, నరసింహ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి : సిపిఐ



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, జులై 15, ప్రభాతవార్త**
కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజల ప్రయోజనాలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మండల రెవెన్యూ అధికారి బైరెడ్డి రాజేష్‌ని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత, జగద్గిరిగుట్టలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 348/1 భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గాజులరామారంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూములు ఆర్టీసీ, పోలీస్ అకాడమీ కోసం కేటాయించినప్పటికీ, కబ్జాదారులు వాటిని పేదలకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఆ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అమాయక ప్రజలు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పేట్‌బషీరాబాద్ సర్వే నంబర్ 5లో జరుగుతున్న ఆక్రమణలపై కూడా అధికారులు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పేదలకు గృహ స్థలాలు కేటాయించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించిన ఉమా మహేష్, భూమిలేని నిరుపేదలను సమీకరించి రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు సెప్టెంబర్‌లో భూ పోరాటం చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, కనకయ్య, కృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతిభను వ్యాపార అవకాశాలుగా మలుచుకొని స్వయం ఉపాధి పొందాలి : వద్దే నవీన్

**మెహిదీపట్నం, జులై 15, ప్రభాతవార్త :** విద్యార్థులు తమ ప్రతిభను వ్యాపార అవకాశాలుగా మలుచుకొని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ ఫోరం సీఈవో డాక్టర్ వద్దే నవీన్ కోరారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో బుధవారం సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ ఫోరం ఆధ్వర్యంలో స్థిరమైన మరియు సమ్మిళితమైన భవిష్యత్తు కోసం యువతకు నైపుణ్యాలను అందించి వారిని శక్తివంతులుగా చేయడం అనే అంశంపై ప్రాజెక్టు విశ్వకర్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ ఫోరం సీఈఓ డాక్టర్ వద్దే నవీన్ పాల్గొని మాట్లాడారు. యువత నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, వ్యవస్థాపక దృక్పథం నేటి కాలానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను వ్యాపార అవకాశాలుగా మలుచుకొని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, వ్యాపార దృక్పధాన్ని పెంపొందించడంతోపాటు స్కిల్ ఇండియా లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు చేతితో తయారు చేసిన ఆభరణాలు, పూలతో రూపొందించిన అలంకరణ వస్తువులు, హస్తకళ ఉత్పత్తులు, గిఫ్ట్ ఐటమ్స్, హోమ్ డేకర్ వస్తువులు, పెయింటింగ్స్ వంటి ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించారు. వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలతో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటుచేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించడంతోపాటు వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాశాల డీన్‌లు, అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారి సృజనాత్మకతను ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బృందం

## మిథిలా నగర్‌లో రూ.40 లక్షల రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**నిజాంపేట్, జులై 15, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మిథిలా నగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. సీఎంసీ నిధులతో చేపట్టనున్న ఈ పనుల్లో రోడ్ నెం.8 (వాటర్ ట్యాంక్ ఎదురుగా), రోడ్ నెం.14 (నారాయణ పాఠశాల ఎదురుగా) రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఈ నిధులు మంజూరైనట్లు స్థానికులు పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో మహాదేవపురం అధ్యక్షులు సిద్ధనొళ్ల సంజీవ్ రెడ్డి, బహదురుపల్లి అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, మిథిలా నగర్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కృష్ణా రెడ్డి, ప్రవీణ్ జద్దూ, జనార్ధన్ రెడ్డి, శివాజీ, భీమేష్, ధనుంజయ్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, అలాగే విజయ్ రెడ్డి, బజ్జీ, నాగరాజు, సురేష్, సాత్విక్, విజయ్, వాలి, దిలీప్, తిరుమల, రాజశేఖర్, వెంకటేశ్వర్లు రెడ్డి, సందీప్, సతీష్, గోనా రెడ్డి, సంతోష్, సుబ్బు, సురేంద్ర, వెంకట్ రావు, ఆర్.కె. టౌన్‌షిప్, మిథిలా నగర్, శిల్పా లేఅవుట్ నివాసితులు పాల్గొన్నారు.



కొలన్ హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

**నేడు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత**

చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల కారణంగా నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు క్రాంతి నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ బాచుపల్లి సహాయ ఇంజనీర్ ఏ. శశిధర్ తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాల్లో క్రాంతి నగర్, శ్రీ హోమ్స్, ఏఎస్ఆర్ బృందావన్ కాలనీ ఉన్నాయి. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

## దూదేకుల సంక్షేమం, అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:** అన్ని రంగాలలో వెనుకబడి దుర్భర దారిద్ర్య జీవితాన్ని గడుపుతున్న నూర్‌భాష దూదేకుల కులస్తుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని తెలంగాణ నూర్‌భాషా దూదేకుల ముస్లిం ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక చైర్మన్ బడేసాహెబ్ మాట్లాడుతూ కొంత మంది పెద్దలు ఇచ్చిన సూచనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న 8 నూర్ భాషా దూదేకుల కుల సంఘాలు ఇటీవల హైదరాబాద్‌లో సమావేశమై 'తెలంగాణ నూర్‌భాషా దూదేకుల ఐక్యవేదిక'గా ఏర్పడి నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకోవడం జరిగిందన్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగా తమకు ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, 200 కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం కోకాపేటలో దూదేకుల కులానికి 'ఆత్మగౌరవ భవనం' ఏర్పాటుకు రెండు ఎకరాల భూమిని, రెండు కోట్లు నిధులు కేటాయించిందని, కాని భవన నిర్మాణం పూర్తి కాలేదని, ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించి తమ జాతికి అంకితం చేయాలని, అలాగే తమ కులంలో అసలు ప్రజా ప్రతినిధులే లేరని విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ కులాన్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అదుకోవాలని ఆయన సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐక్య వేదిక ప్రతినిధులు అహ్మద్ హుస్సేన్ హసీనా బేగం, బషీర్ అహ్మద్, అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు.

### 20న కార్మిక భవన్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి




అడ్డగుట్టలో సిఐటీయూ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

**అడ్డగుట్ట,జులై 15 ప్రభాతవార్త:** భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకూడదని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని లేబర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని సిఐటీయూ నేత ఆర్.మల్లేశ్ తెలిపారు. సిఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తుకారాంగేట్ అడ్డగుట్ట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భావన నిర్మాణ కార్మిక నాయకులు ఏ.రాజు,బి.మధు, ఏ.అజయ్ బాబు, దావిద్, నర్సింహ్మ,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### గోపాల్ రావుకి అభినందనలు వెల్లువ...



గోపాల్ రావుని శాలువాతో సత్కరిస్తున్న బిజెపి శ్రేణులు

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 15, ప్రభాతవార్త**
ఇటీవలే రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ బిజెపి ఉపాధ్యక్షులు సిహెచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గోపాల్ రావు నివాసంలో బిజెపి శ్రేణులు ఆయనని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కే వేణు, డివిజన్ ఉపాధ్యక్షులు కరుణాకర్ రావు, బిజెపి సీనియర్ నాయకులు కనకచంద్రం, బీజేవైఎం నాయకులు హరీష్ యాదవ్, మల్లికార్జున్ రెడ్డి, రాహుల్ తేజ, వివేక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి నగర్‌లో సర్‌ను పర్యవేక్షించిన శ్రీనివాస్ గౌడ్..



సర్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్

**జీడిమెట్ల, జులై 15, ప్రభాతవార్త**
గాజులరామారం సర్కిల్ చంద్రగిరి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు రషీద్ బేగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమానికి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ సర్ కార్యక్రమం ఉద్దేశ్యం, ఓటరు వివరాల మ్యాపింగ్ ప్రాముఖ్యత, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీనాయకులు రషీద్ బేగ్, లాల్ మహమ్మద్, రాజేందర్ పటేల్, ఖదీర్, నవాబ్, సుఖ్ దేవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ మృతికి డిబిపి ప్రగాఢ సంతాపం

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:** కాపు రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతికి దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ పరివర్తన భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఎస్సీ,ఎస్టీ,బిసి ప్రజల మద్దతుతో కాపు సామాజిక వర్గానికి సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కో సం, భవిష్యత్తు కోసం తన జీవితాంతం పోరాడిన నిజమైన ప్రజా నాయకుడు ముద్రగడ పద్మనాభమని కొనియాడారు. కోస్తా జిల్లాల్లో కాపు సామాజిక వర్గానికి, అణగారిన కులాలకు ఆయన ఒక బలమైన నాయకుడని, ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన పోరాటాలు ఇతర కులాలకు స్ఫూర్తినిచ్చాయని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు అంటూ కిర్లంపూడిలోని తన నివాసం వద్ద అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ముద్రగడ నిలిచారని ఆయన ప్రసంశించారు. ఆయన సేవలు ఇతర నాయకులకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయని వడ్లమూరి అన్నారు.

### మహిళా బిల్లులో దివ్యాంగులకు సబ్‌కోటా కల్పించాలి

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:** ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లులో దివ్యాంగులు, బిసి, ఎస్సీ,ఎస్టీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. సబ్‌కోటా కోసం ఉభ య తెలుగు రాష్ట్రాలలో 'మహిళా పిలుపు' పేరిట మహిళలను చైతన్యవంతం చేస్తామని, అన్ని పార్టీల, సంఘాల మద్దతు తీసుకు ని 'చలో పార్లమెంట్' పేరిట ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని ఫ్రంట్ నాయకులు తెలిపారు. ఎన్ఎస్ఎ స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు వి.జి.ఆర్.నారగోని, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, దివ్యాంగ జన్ జాతీయ అధ్యక్షురాలు డా. ఎస్.ఎన్.ఉదయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ అన్ని వర్గాల మహిళలందరికి మహిళా బిల్లులో సబ్‌కోటా కల్పించి నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. 2029 సంవత్సరం నుంచి జరిగే ప్రతి ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు లోక్‌సభ, రాజ్యసభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, శాసన మండలిలో దివ్యాంగులకు కూడా సబ్ కోటా వర్తింపు జేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నాయకులు నందూరి రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఉండడం దురదృష్టకరం: ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్, జులై 15 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం ఉండటం మన దురదృష్టకరం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పద్మారావు నగర్ లోని వెస్లీ చర్చి సమీపంలో 64.30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా త్రాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, స్ట్రీట్ లైట్ లు వెలగడం లేదని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులను సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. మహిళలకు 2500 ఆర్థిక సహాయం, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పేరుకే ప్రజాప్రభుత్వం తప్ప సమస్యల పరిష్కారం లో మాత్రం కాదని విమర్శించారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే విద్యుత్, త్రాగునీటి సమస్య లు ఎందుకు వచ్చాయని అన్నారు. ఎమ్మెల్యే వెంట పద్మారావు నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, వాటర్ వర్క్స్ అధికారులు వెంకట్ రెడ్డి, తిని మురళి, ఎలెక్ట్రికల్ ఏఈ రాజు, హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు యాదగిరి యాదవ్, పాషా, మహేందర్ గౌడ్, కనకయ్య, ప్రేమ్, హరిచారి, కుమార్ యాదవ్, సాయిరాం చారి, కొత్తూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## హలో కార్మిక.. చలో బాచుపల్లి పోస్టర్ ఆవిష్కరణ..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జులై 15, ప్రభాతవార్త**
కనీస వేతనాల జీవో అమలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 18న ఐడీఏ బాచుపల్లి బొల్లారం చౌరస్తాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లిలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోను అన్ని పరిశ్రమల్లో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ తదితర హక్కులు కల్పించాలని, యాజమాన్యాల వేధింపులను అరికట్టాలని కోరారు. ఈ నెల 18న జరిగే బహిరంగ సభకు పరిశ్రమల కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు పి. స్వామి, నరసింహ, ఎల్లమ్మ, లక్ష్మి, శీను, అంజి, మౌనిక, అలివేలు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

**నిజాంపేట్, జులై 15, ప్రభాతవార్త**
నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో వాటర్ వర్క్స్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మల్లేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణలో అక్రమాలు తేలితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు.ప్రగతి నగర్‌లో తాగునీటి సమస్యలు, ఇతర అవకతవకలపై గత నెల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడంతో పాటు 12 అంశాలతో జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. అనంతరం జులై 7, 10 తేదీల్లో వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.దీంతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి అక్రమాలు నిర్ధారణ అయితే కేసు నమోదు చేయాలని, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు లేఖ పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్ యమని, అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రగతి నగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తితే ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## గోల్కొండ బోనాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్,జులై 15,ప్రభాతవార్త:**
గోల్కొండ కోటలో జరిగే జగదాంబ మహాకాళి బోనాల ఉత్సవాలు2026 సందర్భాన్ని పురస్కరించుకుని, హైదరాబాద్ నగరంతో పాటు పరిసర జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం మరియు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా నేటి నుంచి 19వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రామ్‌దేవ్‌గూడ నుండి మక్కాయ్ దర్వాజా మీదుగా గోల్కొండ కోట,లంగర్ హౌస్ నుండి ఫతే దర్వాజా మీదుగా గోల్కొండ కోట, షేక్‌పేట్ నాలా, సెవెన్ టూంబ్స్ (ఏడు సమాధులు) నుండి బంజారా దర్వాజా మీదుగా గోల్కొండ కోటకు చేరుకోవచ్చు. అలాగే నార్సింగి, సన్ సిటీ, లంగర్ హౌస్ వైపు నుండి మక్కాయ్ దర్వాజా – గోల్కొండ కోట – బంజారా దర్వాజా మీదుగా షేక్‌పేట్ – ఫిలింనగర్ – గచ్చిబౌలి వైపు వెళ్లే ట్రాఫిక్‌ను రామ్‌దేవ్‌గూడ వద్ద లంగర్ హౌస్ – బాలికా భవన్ – నానల్ నగర్ వైపు మళ్లించడం జరుగుతుంది. ఫిలింనగర్, షేక్‌పేట్ వైపు నుండి బం జారా దర్వాజా – మక్కాయ్ దర్వాజా మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను బంజారా దర్వాజా వెలుపల అల్జాపూర్ రోడ్ – నెక్నాంపూర్ వైపు మళ్లించడం జరుగుతుంది. మొఘల్ కా నాలా వైపు నుం డి లంగర్ హౌస్ – ఫతే దర్వాజా – గోల్కొండ కోట వైపు వెళ్లే సాధారణ ట్రాఫిక్‌ను లంగర్ హౌస్ ఎక్స్ రోడ్ వద్ద బాలికా భవన్ – నానల్ నగర్ వైపు మళ్లించడం జరుగుతుంది.

## సర్ ఫామ్ నింపడంలో సహకరిస్తాం : నర్సిములు



సర్ ఫామ్ నింపుతున్న ధర్పల్లి నర్సి ములు తదితరులు..

**కార్వాన్, జులై15(ప్రభాతవార్త)**
ఓటర్ల ప్రత్యేక సవరణ సర్ అధికారిక ఫారాలను నింపడంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని,ఈ ప్రక్రియ చాలా సులభం మని,మీ వివరాలను సరిగ్గా నమోదు చేయడానికి అవసరమైన పూర్తి సహకారం మీకు అందుబాటులో ఉంటుందని జియాగూడ కేశవస్వామి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు,భాజపా రాష్ట్ర షెపర్డ్ సెల్ కో కన్వీనర్ దర్పల్లి నర్సి ములు పేర్కొన్నారు.జియాగూడ డివిజన్ పరిధిలోని కేశవ స్వామి నగర్ లో బూత్ నంబర్ 9,11లో నిరక్షరాస్యులైన ఓటర్ల సహాయార్థం సర్ ఫామ్స్ నింపేకార్యక్రం చేపట్టారు.ఈ సందర్భముగా ధర్పల్లి మాట్లాడుతూ..అర్హత కల్గిన ఏ ఒక్కరి ఓటు తప్పి పోకుండదనే తలంపు,ప్రజాస్వామ్య దేశంలో ఓటు విలువ పవిత్రమైని అన్నారు.అర్హత కల్గిన ఏ ఒక్కరు ఓటు హక్కు కోల్పోకూడదనే సంకల్పంతో సేవా చేస్తున్నామని దర్పల్లి నర్సి ములు అన్నారు.ఈ కార్యక్రమంలో బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలి : మర్రి పురురవారెడ్డి

**బేగంపేట జులై 15,ప్రభాతవార్త**
ఎస్ ఐ ఆర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని బీజేపీ యువ నాయకులు మర్రి పురురవారెడ్డి అన్నారు.బుధవారం బేగంపేట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఎస్ ఐ ఆర్ నమోదు కేంద్రాలను మర్రి పురురవారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ నెంబర్ 37,38లను పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెల్సుకున్నారు.ఓటర్లకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మర్రి వెంట మహేష్‌కుమార్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.




తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
EE-Cir 42/EE/SBZ/GHMC
నిట్ నెం : 10/Cir-42/Engg/SBZ/GHMC/2026 తేదీ: 15.07.2026
పనిపేరు : GHMC సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట సర్కిల్ 42లో సివిల్ మరియు విద్యుత్ పనులు. మొత్తం టెండర్ సొమ్ము: రూ.49.42 లక్షలు. క్ర.సం.1 నుండి 9. ప్రారంభ తేదీ: 16.07.2026 మ.3.00గం. నుండి. బిడ్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 20.07.2026 మ.3.00గం. వరకు. శ్రీమతి డి.ఆశాలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నం.42, అంబర్‌పేట, సికింద్రాబాద్ జోన్, GHMC, సెల్ : 9963550657/6309920591 సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరునామా: Cir 42, SBZ, GHMC, అర్బన్ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్. www.tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-42, SBZ, GHMC.
DIPR.NO. 6090-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 15.07.2026

IN THE COURT OF THE 1st ADDL.CHIEF JUDGE, CITY CIVIL COURT AT :: SECUNDARABAD
O.S.No. 52 of 2026
Between:-
Smt. Padmavathi Bai, and others ...Plaintiffs
AND
The Tassildar, and anr .. Defendants
To,
All Concern
Whereas the Smt. Padmavathi Bai, and others, has instituted as suit you for Declaration of Legal Hires the general public/All Concern who has abjection hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the 30th day of July 2026 at 10.30 O'Clock. In the forenoon to answer the claim and further hereby directed to file within 30 days of service of this publication a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence.
Take notice that in default of appearance and to filed to file written statement within 30 days the suit will be heard and determined in their absence.
// BY ORDER OF THE COURT //
Sir. B.Narayana Rao Sheshu
B. Raghavendra Rao
Advocate
3-3-42/201, Bhavani Residency, New Gokhale Nagar, Ramanthapur, Hyderabad -013
99492 04488, 73965 72288

PUBLIC NOTICE
The General Public are hereby informed that my client Smt.Nagula Padmavathi @ Murgam Padmavathi, W/o. Kumara Swamy, R/o. H.No.5-16, KSM Engineering College, Chata konda, Kothagudem, Kothagudem Coils, Khamma (Aadhar No7733 1851 3133), presently residing at Flat No.104, 1st Floor, APR APARTMENTS, Uppal Bagayath, Uppal Mandal, Medchal-Malkajgiri District was in the custody of all the original documents relating to her Plot No.86, admeasuring 245 Sq.yards or 204.82 Sq.mtrs, in sy.No.277, situated at RAGANNAGUDA Village, now Abdullapurmet Mandal (Erstwhile Hayathnagar Mandal) Ranga Reddy District with the boundaries NORTH - Plot No.85, SOUTH - Plot No.87, EAST Plot No.100, WEST 25' feet wide Road, but the Original Registered Sale Deed bearing document No.14584/ 1989 Dated 25-10-1989 which stands on the name of my client (containing Cover) has been lost/misplaced by her while she is getting down from City Bus near Ragannaguda X Road on 12-07-2026 when she intends to visit her above plot and to that effect my client also taking necessary legal steps to that effect.
If any person or person(s) who came across the custody of the said Original Registered Sale Deed bearing document No.14584/1989 Dated 25-10-1989 (containing Cover), pertains to the said Plot be pleased to hand-over to the undersigned or to my client.
(N.SWATHI)
Advocate
#3-7-27, RTC Colony, Street No.3, L.B.Nagar, Hyderabad - 500 074
Ph.No.6303072493

IN THE COURT OF THE LEARNED HONORABLE CHIEF JUDGE, AT CITY CIVILCOURT AT HYDERABAD T.G.
O.S. No. 139 of 2026
Between:
Mohammed Waheeduddin @ Azeem S/o Late Mohammed Ghiasuddin, Aged about 65 years old, Occupation Business, R/o, 18-8-123, Edi Bazar, Hyderabad – 500084, T.G.
PLAINTIFF
AND
ALL CONCERNED
DEFENDANTS
To,
ALL CONCERNED
Whereas the Plaintiff has instituted as suit for the RELIEF OF DECLARATION UNDER SECTION 34 OF THE SPECIFIC RELIEF ACT, FOR THE DECLARATION OF THE PLAINTIFF AS THE LEGAL HEIR AND SUCCESSOR OF HIS LATE MOTHER SUGRA BHANU @ RAZIA BEGUM AND THEREFORE THE OWNER AND POSSESSOR OF THE PROPERTIES ENUMERATED HEREIN AFTER, WHICH SHE DIED ON 02-03-2004 POSSESSED OFF, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the 27th DAY OF July 2026, at 10-30 O'clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of Service of this summon a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense. TAKE notice that in default of your appearance and to file your written statement within 30days the suit will be heard and determined in your absence. GIVEN under my hand seal of the court this 13th July 2026.
SUIT SCHEDULE PROPERTIES APPENDED TO THE PLAINT SUIT SCHEDULE PROPERTY A
Suit Schedule A property being all that of the part-off H. No. 18-8-123 Near Dargah, Burahane Saheb Idi Bazar, Hyderabad comprising an area of 666.38 Sq. yds or 559.76 sq mtrs and bounded on the North by Open lane South by Road East by Graveyard and West by Graveyard.
SUIT SCHEDULE PROPERTY B
Suit Schedule B Property being all that of the part-off H.No.18-8-123 Near Dargah, Burahane Saheb Idi Bazar, Hyderabad comprising an area of 720.00 Sq. yds or 604.80 sq mtrs and bounded on the North by Graveyard South by Road East by House of Sugra Begum and West by Neighbors.
SUIT SCHEDULE PROPERTY C
Suit Schedule C Property being half share in another part-of H. No. 18-8-123, Near Dargah, Burahane Saheb Idi Bazar, Hyderabad comprising an area of 600.00 Sq. yds or 501.66 sq mtrs and bounded on the North by part of 18-8-123, South by part of 18-8-123 and lane, East by Donee's property, and West by Neighbors.
Sd/- M/s K. Shailaja For BASTAWALA ASSOCIATES Advocates, Supreme Court of India Hyderabad
Cell no 9642708456
Counsel for Plaintiffs

## ఎస్ఆర్ఐ ప్రక్రియను పరిశీలించిన డీసిఓ సుధాకర్


బీఎల్ఓలతో మాట్లాడుతున్న డీసిఓ సుధాకర్

**హుడాకాంప్లెక్స్,15 జులై, ప్రభాతవార్త :** కందుకూరు రెవెన్యూ డివిజన్ , సరూర్‌నగర్ మండలంలోని, జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను జాయింట్ రిజిస్ట్రర్ డీసిఓ సి. సుధాకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డివిజన్ పరిధిలోని చౌడీ, వి.ఎం.హోం, గౌతమ్ వరల్డ్ స్కూల్‌లలో బీఎల్ఓల సనితీరును పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలను అయన తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించాలని తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చే ధరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ పరిశీలనలో సంబధిత ఎన్నికల రిటర్నింగ్ సిబ్బంధి. స్థానిక బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గణితంపై నైపుణ్యం సాధించడానికి సిప్ అబాకస్ దోహదం: మాధవి


మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకురాలు మాధవి తదితరులు

**మలక్ పేట, జులై 15,ప్రభాతవార్త:**
గణితం పై నైపుణ్యం సాధించడానికి సిప్ అబాకస్ ఎంతో దోహదపడుతుందని దిల్ షుక్ నగర్ సిప్ అబాకస్ నిర్వహకురాలు మాధవి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ సిప్ అబాకస్ కి చెందిన విద్యార్థులు 22వ తెలంగాణ అబాకస్ ప్రొడిజి ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు అవార్డులు, మెడల్స్ సాధించి తమ సత్తాను చాటారు. దిల్ షుక్ నగర్ సిప్ అబాకస్ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు, మెడల్స్ సాధించిన విద్యార్థులను నిర్వాహకురాలు మాధవి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు మాధవి మాట్లాడుతూ గణితం పై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడానికి సిప్ అబాకస్ ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులను గణితంలో నిష్ణాతులను చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల శంషాబాద్ లో క్లాసిక్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన అబాకస్ పోటీలో తమ సంస్థకు చెందిన 70 మందికి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి: జడ్ఇఓ అంకమ్మరావు


సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న భాష్యం పాఠశాల విద్యార్థులు

**మలక్ పేట, జులై 15, ప్రభాతవార్త:**
విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చడానికి కృషి చేస్తున్నామని భాష్యం హైస్కూల్ జడ్ఇఓ అంకమ్మరావు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్ఇఓ అంకమ్మరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష్యం పాఠశాల ఎల్లప్పుడూ విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలను బోధించడంతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయడానికి కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాష్యం లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా సుదర్శన్ నియామకం



**హయత్ నగర్, జులై 15 ప్రభాతవార్త**
తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా గంట సుదర్శన్ ను నియమితులయ్యారు. ఈ మేరకు గంట సుదర్శన్ కు నియమిక పత్రాన్ని బుధవారం సరూర్ నగర్ లో జరిగిన ఉద్యమ కారుల సమావేశంలో ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న గంట సుదర్శన్ ఉద్యమ కారుల సంక్షేమం కోసం భవిష్యత్తులో పని చేస్తారని ఆశిస్తూ ఈ నియామకం చేయడం జరిగింది అని రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్ పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో రాజీలేని పోరాటం చేసిన గంట సుదర్శన్ తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం హక్కుల కోసం క్రియాశీలకంగా పాల్గొంటారని ఆయన తెలిపారు. తెలంగాణ కోసం 2001 నుంచి సుదర్శన్ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు అని రాష్ట్ర ప్రధాన పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న అన్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం నియమించిన బాబు జగ్ జీవన్ రాం, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీకి వైఎస్ చైర్మన్ గా పని చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న కు గంట సుదర్శన్ ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమ కారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర నాయకులు బి. జాన్, జిల్లా నాయకులు ఇరుగు కిరణ్, కొమ్ము రాజశేఖర్, ఇరుగు నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# బిసిల ఆత్మగౌరవంతో ఆటలొద్దు : తలసాని శ్రీనివాస్ యాదవ్


విలేకరులతో మాట్లాడుతున్న తలసాని


సంఘీ భావం తెలుపుతున్న జాజుల

**మన్సూరాబాద్, జులై 15, ప్రభాతవార్త:**
బడుగు, బలహీన వర్గాల ఆత్మాభిమానం మీద అవాకులు చెవాకులు పేలుస్తే మరో తెలంగాణ ఉద్యమం బీసీ లు చూపిస్తారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. వైటీడీఏ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి చేసిన అనిశిత వ్యాఖ్యల నేపథ్యములో బుధవారం చింతలకుంట లోని ఆమె నివాసానికి తలసాని వచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే బీసీ అ పై కొందరు అగ్రకుల నాయకుల పెత్తనం ఎక్కువైందని అన్నారు. తామంత ఒక్కటిగా నిలుస్తే అహంకారపు అగ్రకుల నాయకులు ఊర్లు వదిలి పారిపోవలసి వస్తుందని హెచ్చరించారు. ఎల్బీ నగర్ లో ఈశ్వరమ్మ ఆనాటి నుండి నేటి వరకు ప్రజా సేవలోనే ఉన్నారని, ఎక్కడ ఆమె పై ఒక్క ఆరోపణలు లేవని తల్లి లాంటి ఆమె పై జక్కిడి చేసిన తీవ్ర పదజాలాన్ని తాము ముక్త ఖంటంతో ఖండిస్తున్నామని అన్నారు. ఇక పై రాష్ట్రం లో ఏ ఒక్క బీసీ నేత లపై అగ్ర కుల నాయకులు పిచ్చి పిచ్చి గా మాట్లాడుతే ఆ ఊరికి వచ్చి బుద్ది చెపుతామని అన్నారు. ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యల సందర్భంగా నేడు బడుగు బలహీన వర్గాల వారంతా ఏకమై ఆమెకు సంఘీ భావం తెలపడం శుభపరిణామ మని అన్నారు. నగర నడిబొడ్డున ఇంత జరుగుతున్న కానీ పోలీస్ యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. అగ్రకుల అహంకారానికి ఈ సంఘటన ఒక నిదర్శనమని, తమంతా ఒక్కటైతే ఎవ్వరూ ఉండరని ఇకనైనా జాగ్రతగా ఉండాలని ఆయన హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బడుగులపై అగ్రకుల దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.నేడు రాష్ట్రం లో ఎక్కడ చూసినా ఈ సంఘటనలే ఉన్నాయని, కాంగ్రెస్ అంటే రెడ్ల పార్టీ నా అని ఆయన ప్రశ్నించారు. బడుగులు లేనిదే అగ్రకులాల జీవితం లేదనే విషయం మరవద్దని గుర్తు చేశారు. ఓ ప్రక్క బీసీ ల రిజర్వేషనులు ఇస్తామని రాహుల్ గాంధీ చెప్పుంటే తెలంగాణ లో మాత్రం రెడ్ల కాంగ్రెస్ నడుస్తుందని ఎద్దేవా చేశారు. ఈశ్వరమ్మ పై అనుశిత వ్యాఖ్యలు చేసిన శివచరణ్ ను వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన బడుగుల ఆత్మ గౌరవానికి సంబంధించినదిగా భావిస్తున్నామని వెంటనే కాంగ్రెస్ చర్యలు తీసుకోకుంటే బీసీల మంత ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మకు పలువురు బీసీ నాయకులు పెద్ద ఎత్తున వచ్చి సంఘీ భావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన వారిలో జూబ్లీహిల్స్ ఎంఎల్ ఏ నవీన్ యాదవ్, ఎంఎల్సీ నెల్లికంటి సత్యం, బడుగుల లింగయ్య, మాజీ ఎంఎల్ ఏ జైపాల్ యాదవ్, తుల ఉమా, క్యామ మల్లేశం, వట్టె జానయ్య, గుజ్జ కృష్ణ, గణేశ్ యాదవ్,శ్యామ్ సుందర్, అనిల్ పాల్గొన్నారు.

## సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడిన కేర్ ఆసుపత్రి వైద్యులు

**-మహిళ మెదడులో కణితిని తొలగించిన వైద్యులు**

**మలక్ పేట, జులై 15, ప్రభాతవార్త:**
మలక్ పేట కేర్ ఆసుపత్రి వైద్యులు సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడారు. రెండు నెలలుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ ఒక్కసారిగా మూర్చపోతుహైదరాబాద్ కు చెందిన ఓ మహిళ మలక్ పేట కేర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా వైద్య పరీక్షలు చేయడం జరిగింది. వైద్య పరీక్షలలో మెదడులో సుమారు 4.5 సెం.మీ. పరిమాణంలో కణితి ఉన్నట్లు బయటపడింది. మెదడులోని కీలక భాగాలు, ప్రధాన రక్తనాళాలకు అత్యంత సమీపంలో ఉన్న ఈ కణితిని కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. సకాలంలో చికిత్స అందించడంతో 42 ఏళ్ల హైదరాబాద్ మహిళకు చూపు కోల్పోవడం, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలు తప్పాయి. మలక్ పేట కేర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ భవానీ ప్రసాద్ గంజి నేతృత్వంలోని బృందం రైట్ ఫ్రంటోటెంపోరల్ క్రానియోటమీ ద్వారా కణితిని పూర్తిగా తొలగించారు. అనంతరం నిర్వహించిన పరీక్షల్లో అది మెనింజియోమాగా నిర్ధారణ అయింది. ఈ సందర్భంగా డాక్టర్ భవానీ ప్రసాద్ గంజి మాట్లాడుతూ, "కణితి అత్యంత కీలకమైన మెదడు నిర్మాణాలు, రక్తనాళాలకు సమీపంలో ఉండటంతో శస్త్రచికిత్స అత్యంత జాగ్రత్తగా చేయాల్సి వచ్చిందని తెలిపారు. శస్త్రచికిత్స ఆలస్యమైతే చూపు కోల్పోవడం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం ఉండేది" అని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఒకరోజు మాత్రమే ఐసీయూలో ఉండగా, నాలుగో రోజే డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె సాధారణ జీవితాన్ని గడుపుతున్నారని, తలనొప్పి, మూర్ఛ పూర్తిగా తగ్గాయని ఆయన తెలిపారు. కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల మాట్లాడుతూ, "క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సల్లో సకాలంలో వ్యాధి నిర్ధారణ, నిపుణుల సమన్వయం, ఆధునిక వైద్య సదుపాయాలే విజయానికి కారణమని, ఈ కేసు అందుకు మంచి ఉదాహరణ" అని అన్నారు.
తరచూ వచ్చే లేదా రోజురోజుకూ తీవ్రమవుతున్న తలనొప్పిని నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ భవానీ ప్రసాద్ సూచించారు. ముఖ్యంగా తలనొప్పితో పాటు మూర్ఛ, చూపులో మార్పులు లేదా శరీరంలో బల హీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులను సం ప్రదించాలని తెలిపారు.

## కెసిఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అనే భావనకు ప్రజలు వస్తున్నారు : సబితా ఇంద్రారెడ్డి


సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన యువకులు

**సరూర్‌నగర్, జులై 15 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పాలనతో విసిగిపోతున్న అన్ని వర్గాల ప్రజలు ఇక రాష్ట్రానికి కెసిఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అవుతుందనే భావనకు వస్తున్నారని బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకురాలు, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ మీర్‌పేట్‌కు చెందిన పలువురు యువకులు పెద్ద సంఖ్యలో బుధవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, అవినాష్‌ల ఆధ్వర్యంలో జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన వారు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో గులాబి గూటికి చేరారు. ఈ సందర్భంగా అక్షయ్‌గౌడ్, రాజు, కార్తీక్, మధు, ప్రణీత్, పల్లె కార్తీక్‌గౌడ్, సూర్య చరణ్, వెంకీ, రోహిత్, ఎం.ఆనంద్, ఘని, సాత్విక్, కార్తీక్, చరణ్‌లతో పాటు భారీ సంఖ్యలో తరలివచ్చిన యువత చేరికను స్వాగతిస్తూ వారికి గులాబి కండువాలు వేసి అభినందించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఎప్పటికైనా కెసిఆర్ నాయకత్వమే రక్ష అని మహిళలు, యువత, రైతులు భావిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరగడంలో కెటిఆర్ పాత్ర ఉందనేది ఆమె గుర్తు చేశారు. అబద్దాలు చెప్పి మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆనాడు కెసిఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లతోనే కొన్ని ఉద్యోగాలను భర్తీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నదని విమర్శించారు. పోలీసు, విద్యా శాఖల్లో దాదాపు 40 వేల ఉద్యోగ ఖాళీలు ఉంటే భర్తీ చేయడంలో తాత్సార్యం చేస్తున్నదని అన్నారు. ఆనాడు వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఫీజు రీయంబర్స్‌మెంట్‌నే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేసే కుట్ర చేస్తున్నదని ఆమె ఆరోపించారు. సిఎంది వికృత భాష అంటూ ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దీప్‌లాల్ చౌహాన్, సిద్దాల బీరప్ప, సిద్దాల అంజయ్య, సునీత బాలరాజ్, సుర్వి లతా శేఖర్‌గౌడ్, పంతంగి మాధవి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గడ్డమీది లక్ష్మణ్, షేర్ రమణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గోల్కొండ జగదాంబిక ఆలయ మెట్లకు మహిళల బొట్లు


మెట్లకు పసుపు, కుంకుమలతో బొట్లు పెడుతున్న రజనీ రాజ్‌పుత్ తదితరులు

**సరూర్‌నగర్, జులై 15 ప్రభాతవార్త:**
గోల్కొండ బోనాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కోటలోని జగదాంబిక ఆలయ మెట్లకు మహిళలు పసుపు, కుంకుమలతో బొట్టు పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి సంవత్సరం ఆషాధ మాసం ప్రారంభానికి ముందు వచ్చే అమావాస్య రోజు కోటలోని అమ్మవారి ఆలయ దారి మెట్లకు బొట్లు పెట్టడం ఆచారంగా వస్తున్నది. ఈ నేపథ్యంలో బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ గాయత్రీనగర్‌కు చెందిన రజనీ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో మహిళల బృందం గోల్కొండకు తరలివచ్చి మెట్లకు పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టారు.

## ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్ఐఆర్ కేంద్రాలను సందర్శించిన రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 15 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన అల్మాస్‌గూడ తిరుమలనగర్, గుర్రంగూడ వార్డు కార్యాలయం ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితా పారదర్శకంగా తయారవుతుందని అన్నారు. ఈ మేరకు అర్హులైన ఓటర్లు తమ వివరాలను తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాల్లో నింపి బిఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్, లింగారెడ్డి, విష్ణువర్ధన్‌రావు, భాస్కర్, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో కెల్లా గొప్పదానం....అన్నదానం


అన్నదానం చేస్తున్న కమిటి ఛైర్మన్ భగవాన్, రవి ముదిరాజ

**సైదాబాద్, జులై 15 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఛైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా చంపాపేటలో ని నల్లపోచమ్మ ఎర్రపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి ఛైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 39 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్బినగర్ యూత్ విభాగం అధ్యక్షుడు రవి ముదిరాజ్, టింగ్లికార్ రాజేష్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్, ఆడేళ్ల రాజు, అండేకార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెంగిచెర్లలో సిసి కెమెరాల ఏర్పాటు : డిసిపి సురేష్ కుమార్


సిసి కెమెరాలు ప్రారంభిస్తున్న ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్ తదితరులు

**ఉప్పల్, జులై 15 ప్రభాతవార్త :** కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం మేడిపల్లి పిఎస్ పరిధిలోని బి.ఎం.ఆర్.ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిటి పోలీసింగ్‌లో భాగంగా వంద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీ సురక్ష కార్యక్రమం, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులు మరియు యాజమాన్యంతో వారి సమస్యల గురించి డిసిపి సురేష్ చర్చించారు. కార్యక్రమంలో మేడి పల్లి ఏసీపీ మోహన్, సిఐ జలంధర్‌రెడ్డి, డి.ఐ. ఎలక్షన్ రెడ్డి, పాల్గొన్నారు.

## సర్‌పై తప్పుదొవ పట్టిస్తున్న అధికారులు


సర్ పత్రాలను అందజేస్తున్న రంగ నరసింహగుప్తా

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:** సర్ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వ అధికారులు ప్రజలను తప్పుదొవ పాటిస్తున్నారని చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ రంగ నరసింహగుప్త ఆరోపించారు. చైతన్యపురి డివిజన్ సాయినగర్, హనుమా న్‌నగర్, ఇందిరానగర్, ప్రభాత్‌నగర్‌లోని పోలింగ్ స్టేషన్ లలో బుధ వారం సరూర్‌నగర్ డిప్యూటీ కమిసనరు శ్రీకాంత్, అడిషనల్ డైరెక్టర్ తో కలిసి నర్సింహగుప్తా బూత్‌లలో సర్ పని జరుగుతున్న తీరును పరిశీలించి, ఓటర్ల ఫార్మ్ నింపడంలో వారి ఇబ్బందులను అడిగి తెలుసుకుంటూ ఓటర్లకు పలు సూచనలు చేశారు.సర్ ను సక్రమము గా అములు చేయాలనీ డిప్యూటీకమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

## నింపిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయాలి : డిసి


సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిసి శ్రీనివాస్, సామ రమణారెడ్డి

**సైదాబాద్, జులై 15 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మారుతినగర్ కమ్యూనిటి హాల్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రక్రియను బుధవారం ఎల్‌బినగర్ డిసి శ్రీనివాస్, చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డిలు పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారమ్‌లను ప్రతి ఓటరుకు అందజేయాలని, నింపిన దరఖాస్తులను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని బిఎల్ఓలకు, సిబ్బందికి డిసి సూచించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ హైకమిషన్ ప్రతినిధితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



**ఉప్పల్, జులై 15 ప్రభాతవార్త :** బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధి నళిని రఘు రామన్‌తో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల వీసాలు, ఇతర సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన వీసా అంశాలు, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అలాగే భవిష్యత్తులో విద్యార్థులకు మరింత సహకారం అందించే అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు గంధం నాగేశ్వర్ రావు, జెట్టా కిషోర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## హోమియో వైద్యకళాశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


క్యాన్సర్ అవగాహన పరీక్షలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ డా.లింగరాజు, సూపరిటెండెంట్ డా.విజయ తదితరులు

**రామంతాపూర్, జులై 15 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియో వైద్యకళాశాలలో బుధవారం మహిళల రోగ అవుట్ పేషెంట్ విభాగంలో ఉమంగ్ హెల్త్ ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిన్సిపాల్ డా. లింగరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. విజయ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. పార్థసారదిజ, గైనకాలజీ విభాగాధిపతి డా. సౌజన్య, డా. నాగసురేఖ, ఉమంగ్ హెల్త్ ఇన్నోవేషన్ సభ్యులు శ్రీనివాస్ మరియు సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.లింగరాజు మాట్లాడుతూ పెరుగుతున్న క్యాన్సర్ వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతి నెలా మూడవ బుధవారం మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కమిటీకి సత్కారం


కార్యక్రమంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ శ్రీరామకృష్ణాపురం ఐటీడీఈఎస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, ఇన్‌కమ్ ట్యాక్స్ కాలనీలో జరిగిన ఎన్నికల్లో రాజేశ్రీ రామారావు ప్యానల్ ఘన విజయం సాధించింది. సభ్యులు చూపిన విశ్వాసం, మద్దతుతో ప్యానల్‌లోని అభ్యర్థులందరూ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు.నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా రామస్వామి, ప్రధానకార్యదర్శిగా రాజేశ్రీ రామారావు, కోశాధికారిగా ఎం.నరహరిరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా గంధం వెంకటరమణ, ఎ.ఆంజనేయ ప్రసాద్, కోడాటి సీతారామారావు, అన్నపూర్ణ, కాదంబి కళ్యాణినారాయణ ఘనవిజయం సాధించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రతి సభ్యునికి సమాన సేవలు అందిస్తూ మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేయడా నికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజ యం సాధిం చిన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టీపీసీ సీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, డిసిసి ప్రధానకార్యదర్శి చిలుక ఉపేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ప్లాస్టిక్ గోదాంలో అగ్నిప్రమాదం

**నివాసాల మధ్య గోదాములు ఉండరాదు**


ప్లాస్టిక్ గోదామును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. జులై. 15. ప్రభాతవార్త**
హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీ నందు ఇండ్ల మధ్యలో ఉన్న ఓ ప్లాస్టిక్ గోదాంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గోదాం పక్కన ఉన్న నూతన ఇంట్లో వస్తువులు, ఫర్నిచర్ పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం జరిగింది. ఇంటిని కూడా పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. అలాగే ఇండ్ల మధ్యలో ఇలాంటి గోదాంలు ఉండకుండా కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నివాసాల మధ్యలో గోదాములు ఏర్పాటు చేయకుండా దానికి స్థానికులు సహకారం అవసరం అని తెలిపారు. అలాగే అగ్నిప్రమాదం వల్ల నష్టపోయిన వారికీ కలెక్టర్ మరియు రెవిన్యూ అధికారులచే మాట్లాడి తగు నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, గోపి మధు, భీమ్ నాయక్, నాగిరెడ్డి, సాయియాదవ్, బిక్షపతి, విష్ణు, కింగ్ మధు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యాలు రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనం : మిద్దెల జితేందర్

**సైదాబాద్, జులై 15 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యాలు రాజకీయ దివాళా కోరుతనానికి నిదర్శనమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎలాంటి ఆధారాలు లేకుండా నేరస్తులతో పోల్చేలా మాట్లాడన్ని మిద్దెల జితేందర్ తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా విమర్శలు చేయవచ్చు కాని వ్యక్తిత్వ హననానికి పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్దమని అన్నారు. సామాజిక న్యాయం పారదర్శక పాలనను అందిస్తూ ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుట్రలు పన్నుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడం, సాగునీరు, త్రాగునీటి సదుపాయాల విస్తరణకు చర్యలు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల కల్పనకు భారీ స్థాయిలో నిధులు కేటాయింపులు వంటి అనేక పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ నాయకులు చేసే అసత్య ప్రచారాన్ని తెలంగాణా ప్రజలు నమ్మరని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనను విశ్వసిస్తారని మిద్దెల జితేందర్ స్పష్టం చేశారు.

## భాష్యం పాఠశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు


కార్యక్రమంలో పాల్గొన్న భాష్యం రామకృష్ణ, చైతన్య

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:**
ఆర్కేపురం డివిజన్ భాష్యం పాఠశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు కొత్తపేటలోని భాగ్యశ్రీ ఫంక్షన్‌హాల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, సీఈవో చైతన్య, జోన్ జెడ్ఈఓ అంకమ్మరావు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రయోజనాలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫ్రెష్ స్టడీస్ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు జానపద నృత్యాలు, బోనాలు నృత్యాలు, దేశభక్తి, ఇతర డ్యాన్సులతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు అంకమ్మరావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంకమ్మరావు, ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వారిలో దాగివున్న సృజనాత్మకత నైపుణ్యాన్ని కూడా వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాల రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతోనే అన్ని రంగాలలో విజయాన్ని సులువుగా సాధించవచ్చు అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సాహన్ని అందించాలని వారు సూచించారు.

## బాలాపూర్ డివిజన్ నుండి కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు వేస్తున్న కెఎల్ఆర్

**సరూర్‌నగర్, జులై 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బాలాపూర్ డివిజన్ నుండి బిఆర్ఎస్, బిజెపిలకు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ చొరవతో బిఆర్ఎస్, బిజెపిల నుండి దొడ్డి శ్రీకాంత్, చింతకింది భాను, బోదాసు రాఘవేందర్‌ల ఆధ్వర్యంలో దాదాపు 150 మంది తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బాలు నాయక్, గజ్జెల రామచందర్, జల్‌పల్లి సర్కిల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అహ్మద్ బామ్, పార్టీ నాయకులు గుండోజు వెంకటాచారి, ఎర్ర సుదర్శన్‌ణ, రావుల లింగం, వంగేటి మధుసూదన్‌రెడ్డి, కొండ శ్రీధర్‌రెడ్డి, వరికుప్పల సురేష్, మేకల మహేందర్, కిరణ్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, గుండ్ల కొమురయ్య, గుండ్ల శ్రీశైలం, మైత్రి ఆనంద్, మదారి భాస్కర్, గిరి నాయక్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.